ప్రాక్టీస్ షురూ

భారత ఆటగాళ్ల ముమ్మర కసరత్తు • చెన్నై చేరుకున్న రోహిత్, విరాట్

చెన్నై: స్వదేశంలో సుమారు ఆరు నెలల విరామం తర్వాత బంగ్లాదేశ్‌తో రెండు టెస్టు మ్యాచ్‌ల సిరీస్‌కు సిద్ధమవుతున్న భారత జట్టు ఈ మేరకు సన్నాహకాలు మొదలుపెట్టింది. చెన్నైలోని చిదంబరం స్టేడియం వేదికగా ఈనెల 19 నుంచి జరుగబోయే తొలి టెస్టు కోసం ఇది వరకే నగరానికి చేరుకున్న టీమ్‌ఇండియా.. శుక్రవారం తొలి ప్రాక్టీస్ సెషన్‌లో పాల్గొంది. జట్టు సభ్యులంతా గురువారం నాటికే ఇక్కడికి చేరగా శుక్రవారం ఉదయం కెప్టెన్ రోహిత్ శర్మ, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ టీమ్‌తో కలిశారు. గత నెలలో హెడ్‌కోచ్ బాధ్యతలు చేపట్టిన గౌతం గంభీర్‌తో పాటు అతడి కోచింగ్ బృందం అభిషేక్ నాయర్(అసిస్టెంట్ కోచ్), బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్‌కు స్వదేశంలో ఇదే తొలి సిరీస్. గంభీర్ బృందం పర్యవేక్షణలో ఆటగాళ్లంతా ఉత్సాహంగా ప్రాక్టీస్‌లో పాల్గొన్నారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను బీసీసీఐ తన సోషల్ మీడియా ఖాతాలలో పంచుకుంది.

దులీప్ ట్రోఫీ తొలి దశ పోటీలు ముగిసిన తర్వాతే చెన్నైకి చేరుకున్న కేఎల్ రాహుల్, శుభ్‌మన్ గిల్, వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్, తదితర ఆటగాళ్లు మైదానంలో కొంత సేపు ప్రాక్టీస్ చేశారు. టీ20 ప్రపంచకప్ గెలిచిన తర్వాత కొంతకాలం పాటు విరామం తీసుకున్న జస్‌ప్రీత్ బుమ్రా నెట్స్‌లో చెమటోడ్చాడు. అతడితో పాటు సిరాజ్, తొలిసారి టెస్టు జట్టుకు ఎంపికైన యశ్ దయాల్ సైతం బౌలింగ్ ప్రాక్టీస్ చేశాడు. తొలి టెస్టుకు ఎంపికైనా ఇంకా జట్టుతో చేరని యువ బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్.. దులీప్ ట్రోఫీ రెండో దశ మ్యాచ్‌లు ముగియగానే చెన్నైకి రానున్నాడు.

విరాట్ ఆగమనం

ఆగస్టులో శ్రీలంకతో మూడు వన్డేల సిరీస్ ఆడిన అనంతరం కుటుంబంతో కలిసి ఇంగ్లండ్‌లో గడుపుతున్న విరాట్ కోహ్లీ స్వల్ప విరామం తర్వాత స్వదేశానికి చేరుకున్నాడు. శుక్రవారం ఉదయమే చెన్నైకి చేరుకున్న కోహ్లీ.. విమానాశ్రయం నుంచి నేరుగా టీమ్‌హోటల్‌కు చేరుకున్నాడు. అనంతరం జట్టుతో కలిసిన అతడు.. 45 నిమిషాల పాటు నెట్స్‌లో బ్యాటింగ్ ప్రాక్టీస్ చేసినట్టు బీసీసీఐ వర్గాలు పేర్కొన్నాయి. ఈ ఏడాది జనవరిలో దక్షిణాఫ్రికాతో కేప్‌టౌన్ టెస్టు ఆడిన తర్వాత మళ్లీ రెడ్‌బాల్ క్రికెట్ ఆడనుండటం కోహ్లీకి ఇదే మొదటిసారి. స్వదేశంలో ఇంగ్లండ్‌తో జరిగిన ఐదు టెస్టుల సిరీస్‌కు వ్యక్తిగత కారణాలతో అతడు దూరంగా ఉన్న విషయం విదితమే.

హైదరాబాద్‌కు 25 లక్షల నజరానా

బుచ్చిబాబు టోర్నీ విజేతకు హెచ్‌సీఏ భారీ ప్రైజ్‌మనీ

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ఆల్‌ఇండియా బుచ్చిబాబు ఇన్విటేషనల్ టోర్నీలో విజేతగా నిలిచిన హైదరాబాద్ జట్టుకు భారీ నజరానా దక్కింది. ఏడేండ్ల తర్వాత బుచ్చిబాబు టైటిల్ దక్కించుకున్న హైదరాబాద్ టీమ్‌కు రూ.25 లక్షల నజరానా అందిస్తున్నట్లు హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు శుక్రవారం ప్రకటించారు. ఉప్పల్ స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో ప్లేయర్లను అభినందించిన ఆయన మాట్లాడుతూ 'బుచ్చిబాబు టోర్నీలో హైదరాబాద్ విజేతగా నిలువడం చాలా సంతోషంగా ఉంది. గత సీజన్‌లో రంజీ ప్లేట్ చాంపియన్‌షిప్ దక్కించుకుంది. రానున్న సీజన్‌లో ఎలైట్ టైటిల్ లక్ష్యంగా ఎంచుకున్నాం. క్రికెటర్లకు, సహాయక సిబ్బందికి అన్ని రకాలుగా హెచ్‌సీఏ మద్దతిస్తుంది' అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ క్రికెటర్ వెంకటేశ్ ప్రసాద్, హెచ్‌సీఏ కౌన్సిల్ సభ్యులు దేవరాజ్, దల్జీత్‌సింగ్, బసవరాజు, శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

వ్రితి పతక జోరు

హైదరాబాద్, ఆట ప్రతినిధి: మంగళూరు(కర్నాటక) వేదికగా జరుగుతున్న 77వ జాతీయ సీనియర్ అక్వాటిక్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ యువ స్విమ్మర్ వ్రితి అగర్వాల్ పతక జోరు దిగ్విజయంగా కొనసాగుతున్నది. శుక్రవారం జరిగిన మహిళల 200మీటర్ల ఫ్రీస్టయిల్ విభాగంలో వ్రితి 2:09:25 సెకన్ల టైమింగ్‌తో కాంస్య పతకం సొంతం చేసుకుంది. హశిక(కర్నాటక), అదితి(మహారాష్ట్ర) వరుసగా స్వర్ణ, రజత పతకాలు కైవసం చేసుకున్నారు. మరోవైపు పురుషుల 400మీటర్ల వ్యక్తిగత మెడ్లే విభాగంలో రాష్ట్రానికి చెందిన వర్షిత్ 4:37:68సె టైమింగ్‌తో కాంస్యం ఖాతాలో వేసుకున్నాడు.

గ్రామీణ క్రికెటర్ల కోసం టీడీసీఏ

లోగో ఆవిష్కరించిన వెంకటేశ్వర్‌రెడ్డి

హైదరాబాద్, ఆట ప్రతినిధి: తెలంగాణ గ్రామీణ ప్రాంత క్రికెటర్ల కోసం మరో కొత్త అసోసియేషన్ పురుడు పోసుకుంది. గ్రామీణ స్థాయి క్రికెటర్లకు జరుగుతున్న అన్యాయానికి చరమగీతం పాడేందుకు అల్లీపురం వెంకటేశ్వర్‌రెడ్డి సారథ్యంలో తెలంగాణ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్(టీడీసీఏ) కొత్తగా ఏర్పాటైంది. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో టీడీసీఏ లోగో ఆవిష్కరణ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. ఈ సందర్భంగా వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ 'తెలంగాణ గ్రామీణ స్థాయి క్రికెటర్లకు సరైన న్యాయం జరుగడం లేదు. హెచ్‌సీఏ పూర్తిగా హైదరాబాద్ వరకే పరిమితమైంది. ఇప్పటి వరకు జిల్లాల నుంచి హైదరాబాద్ రంజీ టీమ్‌కు ఆడిన క్రికెటర్లు పెద్దగా లేరు. ఈ నేపథ్యంలోనే అద్భుత ప్రతిభ కల్గిన పల్లె క్రికెటర్లకు మద్దతుగా నిలిచేందుకు టీడీసీఏ ఏర్పాటు చేశాం. రానున్న రోజుల్లో బీసీసీఐ గుర్తింపు కోసం ప్రయత్నం చేస్తాం' అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఐఏఎస్ కేవీ రమణాచారి, ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లేవర్ కప్ నుంచి నాదల్ నిష్క్రమణ

రిటైర్మెంట్‌పై ఊహాగానాలు

బెర్లిన్(జర్మనీ): వచ్చే వారం నుంచి బెర్లిన్ వేదికగా జరగాల్సి ఉన్న లేవర్ కప్ నుంచి టెన్నిస్ దిగ్గజం రఫెల్ నాదల్ తప్పుకున్నాడు. 'ఈ విషయం మీతో పంచుకుంటున్నందుకు నాకు చాలా నిరాశగా ఉంది. లేవర్ కప్‌లో నేను ఆడటం లేదు' అని నాదల్ తెలిపాడు. గత రెండేండ్లుగా ఫిట్‌నెస్ సమస్యలతో పాటు గాయాలతో సతమతమవుతున్న అతడు.. ఈ ఏడాది తన అడ్డా అయిన ఫ్రెంచ్ ఓపెన్ తొలి రౌండ్‌లోనే నిష్క్రమించాడు. యూఎస్ ఓపెన్ నుంచీ తప్పుకున్న అతడు తాజాగా లేవర్ కప్ నుంచీ వైదొలగడంతో 38 ఏండ్ల ఈ స్పెయిన్ బుల్ త్వరలోనే టెన్నిస్‌కు రిటైర్మెంట్ ప్రకటిస్తాడని ఊహాగానాలు వెల్లువెత్తుతున్నాయి.

ఇండియా 'సీ' 525 ఆలౌట్

అనంతపూర్: దులీప్ ట్రోఫీ రెండో దశ మ్యాచ్‌లలో భాగంగా రుతురాజ్ గైక్వాడ్ సారథ్యంలోని ఇండియా 'సీ' భారీ స్కోరు సాధించింది. అనంతపూర్ వేదికగా ఇండియా 'బీ'తో జరుగుతున్న మ్యాచ్‌లో గైక్వాడ్ సేన.. తొలి ఇన్నింగ్స్‌లో 525 పరుగులు భారీ స్కోరు సాధించింది. తొలి రోజు ఇషాన్ కిషన్ సెంచరీతో మెరవగా రెండో రోజు మానవ్ సుతర్ (82), అన్షుల్ కంబోజ్ (38) రాణించారు. అనంతరం బ్యాటింగ్‌కు వచ్చిన 'బీ' జట్టు.. రెండో రోజు ఆట ముగిసే సమయానికి 36 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 124 పరుగులు చేసింది. ఆ జట్టు సారథి అభిమన్యు ఈశ్వరన్ (51 నాటౌట్), జగదీశన్ (67 నాటౌట్) క్రీజులో ఉన్నారు.

ఖలీల్, అకిబ్ ధాటికి విలవిల

ఇండియా 'డీ'తో జరుగుతున్న మ్యాచ్‌లో 'ఏ' జట్టు భారీ ఆధిక్యం సాధించింది. మయాంక్ అగర్వాల్ నేతృత్వంలోని ఆ జట్టు.. తొలి ఇన్నింగ్స్‌లో 290 పరుగులకు ఆలౌట్ అయింది. మొదటి ఇన్నింగ్స్‌లో శ్రేయస్ అయ్యర్ కెప్టెన్సీలోని 'డీ'.. 183 పరుగులకే చేతులెత్తేసింది. ఆ జట్టులో దేవ్‌దత్ పడిక్కల్ (92) తృటిలో సెంచరీ మిస్ చేసుకోగా మిగతా వారు విఫలమయ్యారు. కూలింగ్ గ్లాసెస్‌తో బ్యాటింగ్‌కు వచ్చిన కెప్టెన్ అయ్యర్ 7 బంతులాడి డకౌట్‌గా వెనుదిరిగాడు. ఖలీల్ అహ్మద్, అకీబ్‌ఖాన్ తలా మూడు వికెట్లు పడగొట్టారు. తొలి ఇన్నింగ్స్‌లో 107 పరుగుల ఆధిక్యాన్ని దక్కించుకున్న 'ఏ' జట్టు.. రెండో రోజు ఆట ముగిసే సమయానికి వికెట్ నష్టానికి 115 రన్స్ చేసింది. తద్వారా 222 పరుగుల భారీ ఆధిక్యంతో మ్యాచ్‌పై పట్టు బిగిస్తోంది.

అఫ్గాన్, కివీస్ టెస్టు రద్దు

• ఈ శతాబ్దిలో ఇదే ప్రథమం

నోయిడా: అఫ్గానిస్థాన్, న్యూజిలాండ్ మధ్య నోయిడా వేదికగా జరగాల్సిన ఏకైక టెస్టు నాలుగు రోజుల నాటకీయ పరిణామాల తర్వాత అధికారికంగా రద్దైంది. ఈ మ్యాచ్‌లో టాస్ కూడా పడకపోగా ఒక్క బంతి సైతం పడలేదు. టెస్టు క్రికెట్ చరిత్రలో ఇలా జరగడం ఇది 8వ సారి కాగా 1998 తర్వాత ఇదే ప్రథమం. కాగా తొలి మూడు రోజులు నోయిడా స్టేడియంలో ఔట్ ఫీల్డ్ తడిగా ఉండటంతో ఆట సాగకపోగా తర్వాత రెండు రోజులూ వర్షాలతో మ్యాచ్‌ను రద్దు చేశారు. మ్యాచ్ రద్దవడంపై ఇరు జట్ల హెడ్‌కోచ్‌లు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

సెమీస్‌కు క్రాస్టో జోడీ

హో చి మిన్స్: భారత మిక్స్‌డ్ డబుల్స్ ద్వయం తనీషా క్రాస్టో, ధ్రువ్ కపిల వియత్నాం ఓపెన్ సెమీఫైనల్స్‌కు దూసుకెళ్లారు. శుక్రవారం ఇక్కడ జరిగిన మిక్స్‌డ్ డబుల్స్ క్వార్టర్స్‌లో భారత జోడీ.. 14-21, 21-10, 21-14తో భారత్‌కే చెందిన సతీశ్ కుమార్, ఆద్యా వరియత్‌ను ఓడించారు. తొలి గేమ్‌ను దక్కించుకున్నా సతీశ్, ఆద్యా జోడీ చేతులెత్తేసింది. పురుషుల సింగిల్స్ క్వార్టర్స్‌లో తరుణ్ మల్లెపల్లి క్వార్టర్స్‌లోనే వెనుదిరిగాడు.

భారత్‌కు 48 పతకాలు

చెన్నై: సౌత్ ఏషియన్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో భారత్ ఏకంగా 48 పతకాలు కొల్లగొట్టి ఓవరాల్ టైటిల్‌ను సొంతం చేసుకుంది. శుక్రవారంతో ముగిసిన టోర్నీలో భారత అథ్లెట్లు 21 స్వర్ణాలు సహా 22 రజతాలు, 5 కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు. శ్రీలంక(9స్వర్ణాలు, 9రజతాలు, 17కాంస్యాలు) రెండో స్థానంలో నిలిచింది.

తైక్వాండో టోర్నీకి బాబులాల్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: మహారాష్ట్ర వేదికగా జరుగనున్న సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్ఈ) సౌత్‌జోన్ తైక్వాండో పోటీల్లో రాష్ట్రానికి చెందిన బాబులాల్ టెక్నికల్ డెలిగేట్‌గా ఎంపికయ్యాడు. ఈ నెల 20 నుంచి 23 వరకు జరుగనున్న టోర్నీలో బాబు బాల్ సాంకేతిక ప్రతినిధిగా వ్యవహరించనున్నాడు. సీబీఎస్ఈ స్పోర్ట్స్ హెడ్ మజిత్‌సింగ్ ఈ విషయాన్ని అధికారికంగా ధృవీకరించారు.

ఆయన సలహా పాటించాను

'దేవర' పాటల్లో ఎన్టీఆర్‌కి ధీటుగా డ్యాన్స్‌లు చేసి ఆడియన్స్‌ని ఫిదా చేసేసింది శ్రీదేవి తనయ జాన్వీ కపూర్. 'దేవర-1' ప్రమోషన్స్‌లో ప్రస్తుతం జాన్వీ బిజీ బిజీగా ఉంది. నిదానంగా మీడియాతో ఇంటర్వ్యూలు కూడా షురూ చేసింది. తాజాగా తన టాలీవుడ్ ఎంట్రీ గురించి ఆసక్తికరమైన విషయాలను చెప్పుకొచ్చింది జాన్వీ. 'బాలీవుడ్‌లో నాకు అవకాశాలకు కొదవ లేదు. పైగా తక్కువ సమయంలో మంచి పాత్రలు పోషించాను. అయితే.. నేను సౌత్‌లో కూడా రాణించాలనేది అమ్మ కోరిక. ఆమె కోరిక తీర్చాలంటే సౌత్ సినిమా చేయాలి. దానికి తగ్గట్టే సౌత్ నుంచి నాకు ఆఫర్లొచ్చాయి. వాటిలో తెలుగు నుంచి 'దేవర' ఒకటి. అలాగే తమిళంలో కూడా ఓ సినిమా వచ్చింది. ఈ రెండింటిలో ఏ సినిమా చేయాలో తెలియక తికమక పడ్డాను. అప్పుడు కరణ్‌జోహార్ నాకు మార్గదర్శనం చేశారు. 'తారక్ సినిమాతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇవ్వు. ఆ తర్వాత ఆటోమేటిగ్గా మంచి ఛాన్సులొస్తాయి' అని అన్నారు. ఆయన సలహా పాటించాను. ఆ సలహా నిజంగా కూడా బాగా కలిసొచ్చింది. వెంటనే రామ్‌చరణ్ సినిమా వచ్చింది. ఇంకా కొన్ని సినిమాలు టాక్స్‌లో ఉన్నాయి. ఏదేమైనా తెలుగు సినిమాతో సౌత్‌కి ఎంట్రీ ఇవ్వడం చాలా ఆనందంగా ఉంది' అంటూ చెప్పుకొచ్చింది జాన్వీ కపూర్

దేవర ఘనత

చిత్రం

పాటలు, ప్రచార చిత్రాల ద్వారా ఇప్పటికే 'దేవర -1' సినిమాపై అంచనాలు ఆకాశాన్ని అంటాయి. దీనికి తగ్గట్టు ఈ సినిమా మరో ఘనత సాధించింది. ఈ నెల 27న ప్రపంచవ్యాప్తంగా 'దేవర -1' విడుదల కానున్న విషయం తెలిసిందే. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఈ నెల 26న సాయంత్రం ఆరున్నర గంటలకు, ఘనమైన సినిమా చరిత్ర కలిగిన ప్రతిష్టాత్మక సినిమా వేదిక 'బియాండ్ ఫెస్ట్'లో 'దేవర -1' రెడ్ కార్పెట్ ఈవెంట్ జరుపనున్నారు. హాలీవుడ్, లాస్ ఏంజిల్స్‌లోని ఐకానిక్ ఈజిప్షియన్ థియేటర్లో ఈవెంట్ జరుగనుంది. ఇక్కడ ప్రీమియర్ కానున్న తొలి భారతీయ సినిమాగా 'దేవర -1' రికార్డు సృష్టించింది. ఈ ప్రీమియర్‌కి ప్రముఖ హాలీవుడ్ నటీనటులతో పాటు హై ప్రొఫైల్ ఉన్న అమెరికన్ సిటిజన్స్ కూడా హాజరు కానున్నారు. ఈ వేడుక ప్రపంచ వేదికపై 'దేవర-1' ఖ్యాతిని మరింత పెంచనున్నదని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. ఎన్టీఆర్ ప్రధాన పాత్ర పోషిస్తున్న ఈ పాన్‌ఇండియా చిత్రంలో జాన్వీకపూర్ కథానాయిక. సైఫ్ అలీఖాన్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ప్రకాశ్‌రాజ్, శ్రీకాంత్, షైన్ టామ్ చాకో, అజయ్, గెటప్ శ్రీను తదితరులు ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: రత్నవేలు, ఎడిటింగ్: శ్రీకర్ ప్రసాద్, దర్శకుడు కొరటాల శివ, నిర్మాతలు: మిక్కిలినేని సుధాకర్, హరికృష్ణ.కె, సమర్పణ: నందమూరి కల్యాణ్‌రామ్.

చివరి అధ్యాయానికి శ్రీకారం

దశాబ్దాల పాటు వెండితెరపై అలరించిన ఓ గొప్ప స్టార్, తన మార్గాన్ని మార్చుకొని ప్రజా క్షేత్రంలోకి వెళ్లాలని నిర్ణయించుకున్నప్పుడు.. తను నటించే చివరి సినిమాపై ఇన్నాళ్లూ ఆరాధించిన అభిమానుల్లో ఎంతటి హైప్ ఉంటుందో ప్రత్యేకించి చెప్పాల్సిన పనిలేదు. తమిళనాట త్వరలో అలాంటి సినిమానే రానుంది. వివరాల్లోకెళ్తే.. తమిళ అగ్రనటుడు విజయ్ 'తమిళగ వెట్రి కళగం' పేరిట సొంత రాజకీయపార్టీని స్థాపించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో 'దళపతి 69'(వర్కింగ్ టైటిల్)కి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలో రానున్నదని తెలియజేస్తూ, సదరు చిత్ర నిర్మాణ సంస్థ కె.వి.ఎన్ ప్రొడక్షన్స్ ఓ ప్రెస్‌నోట్ విడుదల చేసింది. 'కోట్లాది అభిమానులు ఆతృతగా ఎదురుచూస్తున్న 'దళపతి 69' సినిమాకు సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలో రానుంది. ఇన్నాళ్లూ మనల్ని అలరించిన వ్యక్తికి ఇదే చివరి సినిమా కానుంది. ఈ కాంబో అత్యంత విధ్వంసకరంగా, ఇంతకు మించి అద్భుతం మరొకటి లేదు అనిపించేలా ఉండబోతున్నది' అనేది ఈ ప్రెస్‌నోట్ సారాంశం.

థర్డ్ కేస్ ఇన్వెస్టిగేషన్

వరుస విజయాలతో దూసుకుపోతున్న నాని కథానాయకుడిగా రూపొందుతున్న చిత్రం 'HIT : The 3rd Case'. ఇది నాని నటిస్తున్న 32వ సినిమా కావడం విశేషం. డాక్టర్ శైలేష్ కొలను దర్శకుడు. ప్రశాంతి తిపిర్నేని నిర్మిస్తున్నారు. ఇందులో హిట్ ఆఫీసర్ అర్జున్ సర్కార్‌గా ఫెరోషియస్ కేరక్టర్‌లో నాని కనిపించనున్నారు. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ శుక్రవారం నుంచి హైదరాబాద్‌లో మొదలైంది. తొలిరోజే నాని షూటింగ్‌లో జాయిన్ అయ్యారు. ఈ షెడ్యూల్‌లో కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తామని, వచ్చే ఏడాది మే 1న వేసవిలో విడుదల చేస్తామని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: సాను జాన్ వర్గీస్, సంగీతం: మిక్కీ జె.మేయర్, నిర్మాణం: వాల్‌పోస్టర్ సినిమా, యునానిమస్ ప్రొడక్షన్స్.

బాలీవుడ్‌లో మ్యూజికల్ లవ్‌స్టోరీ

తెలుగు సినిమాలకు కాస్త బ్రేక్‌నిచ్చిన మరాఠీ సుందరి మృణాల్ ఠాకూర్ ప్రస్తుతం బాలీవుడ్‌లో అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నది. అక్కడ నాలుగు చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉంది. వాటిలో అగ్ర దర్శకుడు సంజయ్‌లీలా భన్సాలీ నిర్మిస్తున్న సినిమాపై మృణాల్ ఠాకూర్ ఎన్నో ఆశల్ని పెట్టుకుంది. సిద్ధార్థ్ చతుర్వేది హీరోగా నటిస్తున్న ఈ చిత్రానికి రవి ఉద్యావార్ దర్శకత్వం వహిస్తున్నారు. బాలీవుడ్‌లో ప్రేమకథా చిత్రాల్ని అద్భుత రీతిలో తెరకెక్కిస్తుంటారు సంజయ్‌లీలా భన్సాలీ. దాంతో ఈ సినిమా తన బాలీవుడ్ కెరీర్‌కు బ్రేక్‌నిస్తుందనే నమ్మకంతో ఉంది మృణాల్. తాజాగా ఈ సినిమాకు 'తూ హీ హో..' అనే పేరును ఖరారు చేశారు. ఈ సినిమాలో నాయకానాయికలు సిద్ధార్థ్ చతుర్వేది, మృణాల్ ఠాకూర్ ఇద్దరూ మ్యూజిషియన్స్‌గా కనిపిస్తారని, మనసుల్ని కదిలించే సంగీతభరిత ప్రేమకథా చిత్రమిదని దర్శకుడు తెలిపారు. ఉత్తరాఖండ్‌లోని సుందరమైన లొకేషన్లలో తదుపరి షెడ్యూల్ కోసం సన్నాహాలు చేస్తున్నామని నిర్మాత సంజయ్‌లీలా భన్సాలీ తెలిపారు.

రెండు ప్రపంచాల 'సత్యం సుందరం'

కార్తీ, అరవింద్ స్వామి ప్రధానపాత్రధారులుగా రూపొందిన చిత్రం 'సత్యం సుందరం'. '96'ఫేం సి.ప్రేమ్‌కుమార్ దర్శకుడు. సూర్య, జ్యోతిక నిర్మాతలు. ఏషియన్ సురేశ్ ఎంటర్టైన్మెంట్స్ వారు ఈ చిత్రాన్ని తెలుగులో విడుదల చేస్తున్నారు. ఈ నెల 28న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా టీజర్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఈ టీజర్ కార్తీ, అరవింద్‌స్వామికి సంబంధించిన రెండు ప్రపంచాలను పరిచయం చేసింది. వారిద్దరి ఆన్‌స్క్రీన్ కెమిస్ట్రీ హైలైట్‌గా టీజర్ సాగింది. ఇందులో కార్తీ అమాయకత్వంతో కూడి పాత్ర చేస్తే, అరవింద్ స్వామి రిజర్వ్‌డ్, అర్బన్ పర్సనాలిటీగా కనిపించారు. శ్రీదివ్య, స్వాతి కొండే, దేవదర్శిని ఇతర పాత్రలు పోషించిన ఈ చిత్రానికి కెమెరా: మహేందిరన్ జయరాజు, సంగీతం: గోవింద్ వసంత, నిర్మాణం: 2డీ ఎంటర్‌టైన్‌మెంట్.

నా అకౌంట్ హ్యాక్ అయ్యింది

లేడీ సూపర్‌స్టార్ నయనతార హ్యాకింగ్ బారిన పడింది. ఆమె ఎక్స్(ట్విటర్) ఖాతా హ్యాక్ అయినట్టు తాజాగా ఆమె తెలియజేసింది. 'దయచేసి ఆ అకౌంట్ నుంచి వచ్చే సందేశాలకు కానీ, ట్వీట్లకు కానీ ఎవరూ స్పందించొద్దు. నా అకౌంట్ హ్యాక్ అయ్యింది. ఈ విషయంపై సైబర్ పోలీస్‌లకు కంప్లయింట్ చేశా. త్వరలోనే మళ్లీ మీ ముందుకొస్తా' అని నయన్ తన ఎక్స్ ద్వారా వెల్లడించింది. నయనతార మొదట్నుంచీ సోషల్‌మీడియాలో యాక్టివ్‌గానే ఉంటుంది. తనకు సంబంధించిన ఏ విషయాన్నయినా అభిమానులతో పంచుకునేందుకు ఆమె ఎక్స్‌ని, ఇన్‌స్టాని ఉపయోగిస్తుంది. తన సినిమాల ప్రమోషన్స్ విషయంలో కూడా కచ్చితంగా కొన్ని పద్ధతులు పాటిస్తుంది. తన సొంత ప్రొడక్షన్ సినిమా అయితే.. వ్యక్తిగత సోషల్ మీడియా ద్వారా ప్రమోట్ చేస్తుంది. బయట సినిమాలను ఆమె ప్రమోట్ చేయదు. అలాంటి నయనతార ఖాతా హ్యాక్ అవ్వడంతో ఆమె ఈ విషయాన్ని చాలా సీరియస్‌గా తీసుకుంది. ప్రస్తుతం టెస్ట్, తని ఒరువన్-2, మన్నన్‌గట్టి 1960, డియర్ స్టూడెంట్స్ సినిమాలతో నయనతార బిజీగా ఉంది.

మన్యం ధీరుడి పోరాటం

ఆర్‌వీవీ మూవీస్ సంస్థ రూపొందిస్తున్న చిత్రం 'మన్యం ధీరుడు'. స్వీయ నిర్మాణంలో ఆర్‌వీవీ సత్యనారాయణ నటిస్తూ నిర్మిస్తున్నారు. నరేష్ డెక్కల దర్శకుడు. ఈ నెల 20న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా నిర్మాత, హీరో ఆర్‌వీవీ సత్యనారాయణ మాట్లాడుతూ 'అల్లూరి సీతారామరాజు నిజమైన చరిత్రను ఈ సినిమాలో ఆవిష్కరించాం. ఈ సినిమా కోసం కత్తి యుద్ధం, విలువిద్యలో శిక్షణ తీసుకున్నా. బ్రిటీషర్లకు వ్యతిరేకంగా అల్లూరి సీతారామరాజు చేసిన వీరోచిత పోరాటం స్ఫూరివంతంగా అనిపిస్తుంది. పాడేరు, హిమాచల్‌ప్రదేశ్, కశ్మీర్ వంటి ప్రదేశాలలో చిత్రీకరణ జరిపాం' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: పవన్‌కుమార్.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.